ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్

లింగోజిగూడ: పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవేర్ గ్లోబల్ ఆసుపత్రి సహకారంతో మంగళవారం బైరామల్‌గూడలోని అవేర్ పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించిందని, సుమారు 250 మంది బీపీ, షుగర్, కంటి, దంత తదితర పరీక్షలు చేయించుకున్నారని వైద్యులు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతుందని, చుట్టు పక్కల కాలనీల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉందని వైద్యులు అన్నారు.

'రామలింగేశ్వర' ఆలయ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

నాగోలు: డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ సౌత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లోని శ్రీ అభయాంజనేయ సహిత రామలింగేశ్వర స్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా డి.మల్లేశం, సభ్యులుగా సీహెచ్ అశోక్‌రెడ్డి, ఎస్.శేఖర్‌రెడ్డి, ఎస్.మాధవరెడ్డి, గోపాల్ శర్మ, వి.అంజన్‌రెడ్డి, సీహెచ్ రాములు, జి.రవీందర్‌రెడ్డి, వీరాంజనేయులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ డి.మల్లేశం మాట్లాడుతూ, భక్తుల సహాయ సహకారాలతో ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయా కాలనీల ప్రతినిధులతో కలిసి జరుగుతున్న సీసీ రోడ్డు, పార్కు ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో రోజురోజుకు నూతన కాలనీలు ఏర్పడుతున్నాయని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రతినిధులు, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శాతవాహననగర్ కాలనీ నూతన కార్యవర్గం



నూతన అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని శాతవాహననగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందిరాజు లక్ష్మీనారాయణ, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా చెరుకు వెంకటేష్, కార్యదర్శిగా ఎస్.నాగేశ్వర్‌రావు, కోశాధికారిగా వి.చిరంజీవులు, ఉపాధ్యక్షుడిగా టీడీ శర్మ, పీవీకే శాస్త్రి, సంయుక్త కార్యదర్శులుగా గుడి భరత్, ఎస్‌కే రసూల్ సాహెబ్, సంఘటన కార్యదర్శిగా పోచిరాజు సుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నారు. అలాగే, కార్యవర్గ సభ్యులుగా పి.గురునాథరావు, జె.మురళీకృష్ణ, జ్ఞానసుందర్, వాణిరెడ్డి, శోభారాణి, కృష్ణమోహన్, వి.సుబ్బారావు, ఎంఎస్ రెడ్డి, ఎల్.పవన్, బి.ప్రకాష్‌రావు, ఎం.రామకిషన్‌రావు ఎన్నికయ్యారు. కాలనీలోని సమస్యలను ఎమ్మెల్యే, కార్పొరేటర్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు.

ప్లాట్ల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించాలి



మధుయాష్కీ గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాయినగర్ కాలనీవాసులు

నాగోలు: డివిజన్ పరిధిలోని సాయినగర్, గణేష్‌నగర్, కో–ఆపరేటివ్ కాలనీలలో 118 జీఓ ప్రకారం ప్లాట్లు రిజిస్ట్రేషన్ కావడం లేదని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయా కాలనీల ప్రజలు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌ను కోరారు. ఈ మేరకు వారు డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంజులా రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, గత ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 118 జీఓను తీసుకొచ్చిందని, అది పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని, సాయినగర్ పరిధిలోని వివిధ కాలనీలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు కావడం లేదన్నారు. 118 జీఓ ప్రకారం సాయినగర్ పరిసర కాలనీల్లోని ప్లాట్లు రిజిస్ట్రేషన్లు అయ్యే విధంగా కృషి చేయాలి కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు జాలుకుంట్ల జైపాల్ రెడ్డి, పల్లె సాయిలు, ఆకుతోట జయప్రకాశ్, పానుగోట వెంకటేశ్వర్ రావు, రామచంద్రా రెడ్డి, సత్యనారాయణ, సూర్యప్రకాష్ రెడ్డి, దయానంద్ రెడ్డి, లాలయ్య గౌడ్, ప్రభావతి పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి బదిలీ

నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ సీఐ అంజిరెడ్డి స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి రాచకొండ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐ అంజిరెడ్డి దాదాపు 19 నెలల పాటు ఇక్కడ విధులు నిర్వహించారు. కాగా, ఎల్‌బీనగర్ సీఐగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

అసంపూర్తిగా వదిలేశారు!

- సామనగర్ నుంచి హయత్‌నగర్ వెళ్లే రోడ్డు దుస్థితి
- పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు స్థానికుల అవస్థలు



సగంలో ఆగిన రోడ్డు పనులు

ఎల్‌బీనగర్: కొత్త రోడ్డు వేసేందుకు ఉన్న రోడ్డును తవ్విన కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడు. దీంతో జనం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ సామనగర్ నుంచి హయత్‌నగర్ కమ్మరి కుంటకు వెళ్లే మార్గంలోని రోడ్డు దుస్థితి ఇదీ.

◆ రెండు నెలల క్రితం సుమారు 500 వందల మీటర్ల మేర రోడ్డును తవ్వారు. దానిలో సగం దూరం రోడ్డు వేసిన కాంట్రాక్టర్లు మిగతా సగంలో డస్ట్, కంకర వేసి వదిలేశాడు. రెండు నెలలైనా కాంట్రాక్టర్ గానీ, అధికారులుగానీ అటువైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

◆ అధ్వానంగా ఉన్న రోడ్డుపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బూడిద, కంకర వేసి వదిలేయడంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయని, భారీ వాహనాలు వెళ్లే సమయంలో కంకర, రాళ్లు ఎగిరి పాదచారులపై పడుతున్నాయని తెలిపారు. డస్ట్‌తో దుమ్ము భారీగా ఎగిసి పడటంతో ఇబ్బంది కలుగుతోందని స్థానికులు వ్యాపారులు వాపోతున్నారు.

◆ ఎలాంటి కారణం లేకుండా పనులను మధ్యలోనే నిలిపివేయడంపై స్థానికులు మండి పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

నేడు భాగ్యనగర్‌జిల్లా విజయ సంకల్ప యాత్ర



యాత్ర వివరాలు వెల్లడిస్తున్న సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: దేశం సుభిక్షంగా ఉండాలంటే మరోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ కె.సహదేవ్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన కుర్మగూడలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశ అభివృద్ధిని కాంక్షిస్తూ బీజేపీ తలపెట్టిన విజయసంకల్ప యాత్ర భాగ్యనగర్ జిల్లాలో బుధవారం ప్రారంభమవుతుందని తెలిపారు. ఉదయం 9 గంటలకు షాలిబండ చౌరస్తాలో యాత్ర మొదలవుతుందని, ఛత్రినాక చౌరస్తాలో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఐఎస్ సదన్ డివిజన్ వినాయక్‌నగర్ నుంచి మళ్లీ యాత్ర ప్రారంభమై దిల్‌సుఖ్‌నగర్ బజాజ్ ఎలక్ట్రానిక్స్ వద్ద సాయంత్రం 6 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. యాత్రలో ప్రజలతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిరంజన్‌యాదవ్, కార్యదర్శి ఉగాది మహేష్, కుర్మగూడ డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయండి

మలక్‌పేట: మూసారంబాగ్‌లో బుధవారం నిర్వహించనున్న విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని డివిజన్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కృష్ణతులసి నగర్‌లోని నివాసంలో కార్పొరేటర్ విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విజయ సంకల్పయాత్ర నల్లగొండ క్రాస్ రోడ్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై దిల్‌సుఖ్‌నగర్ బజాల్ ఎలక్ట్రానిక్స్ వద్ద ఏర్పాటు చేసిన సభా వేదిక వరకు కొనసాగుతుందన్నారు. రాష్ట్ర నాయకులతో పాటు భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గౌర దేవేందర్, కోశాధికారి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యనగర్‌లో కలుషిత నీటి సరఫరాను అరికట్టండి



సత్యనగర్ కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని వివిధ కాలనీల్లో పాత డ్రైనేజీ లైన్లు, మ్యాన్ హోళ్లు పాడైపోవడంతో మంచినీటిలో డ్రైనేజీ నీళ్లు కలుస్తున్నాయని, వెంటనే డ్రైనేజీ పైప్‌లైన్లకు మరమ్మతు చేయించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జలమండలి అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని సత్యనగర్ కాలనీ రోడ్ నంబర్ 7 లో మంచినీటిలో డ్రైనేజ్ నీళ్లు కలుస్తున్నాయని తెలుసుకున్న కార్పొరేటర్ ఆ కాలనీలో మంగళవారం పర్యటించి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తపేట డివిజన్‌లో ఎన్నో ఏళ్ల కాలం క్రితం వేసిన డ్రైనేజ్ లైన్, మ్యాన్‌హోళ్లు పాడైపోయి తాగు నీటిలో డ్రైనేజీ నీరు కలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జలమండలి జీఎం బలరామ్‌ను ఫోన్‌లో సంప్రదించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. సత్యనగర్‌లో వారం రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. డ్రైనేజీ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని, సమస్య పరిష్కారం అయ్యేంత వరకు కాలనీవాసులకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. కార్పొరేటర్ వెంటన కాలనీ సెక్రెటరీ రమణ, శివరాజ్ పాటిల్, నాయకులు కొత్త తిరుమల, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రానీయొద్దు

హుడాకాంప్లెక్స్: వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా చర్యలు తీసుకోవాలని సరూర్‌నగర్ ఎస్‌ఈపీ కరుణాకర్‌బాబు సిబ్బందికి సూచించారు. మంగళవారం సరూర్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని సంబంధిత అధికారులు సమీక్ష సమావేశానికి ఆయన మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంతో పాటు అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. డీఈ రామకృష్ణ, ఏడీఈ తిరుపతయ్య, ఏఈలు అనూష రాణి, జాన్సన్, రోహిత్‌రాజా పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు వస్తే ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు

సరూర్‌నగర్	-9490153567
కొత్తపేట	-9490153568
ఆర్.కే.పురం	-9490153569
ఎల్‌బీనగర్	-9490153571
గ్రీన్‌హిల్స్	-7013174759
బండ్లగూడ	-8333924861
హయత్‌నగర్	-9490153577
ఆటోనగర్	-9493193148
శాంతినగర్	-9490153588
పెద్దఅంబర్‌పేట	-8333924864

దొంగల భయం లేదిక!

- ఆటోకు సీసీ కెమెరా బిగింపు
- కూరగాయల వ్యాపారి వినూత్న ఆలోచన



కెమెరా బిగించిన ఆటోతో మహ్మద్ గౌస్

చంచల్‌గూడ: నేరగాళ్లు ఎంతటివారైన సరే రెండు అంగుళాల సీసీ కెమెరా వారిని ఒక కంట కనిపెడుతుంది. ప్రస్తుత కాలంలో సీసీ కెమెరా కూడా మనుషులకు నిత్యావసరాల్లో ఒకటిగా మారింది. నేరాలను అదుపు చేయడంలో ప్రజలకు, పోలీసులకు సీసీ కెమెరాలు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయి. గతంలో సీసీ కెమెరాలు ఆఫీసుల్లో, ఇళ్లలో, ప్రధాన చౌరస్తాలో దర్శనమిచ్చేవి. కానీ మారుతున్న కాలంతో పాటు సీసీ కెమెరాల వినియోగం రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. సీసీ కెమెరాలు ఇప్పుడు మొబైల్ కెమెరాలుగా మారుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే... అంబర్‌పేటకు చెందిన మహ్మద్ గౌస్ మాదన్నపేట కూరగాయాల మార్కెట్‌లో ప్రతిరోజూ కూరగాయలు కొనుగోలు చేసేందుకు తన ట్రాలీ ఆటోలో వస్తుంటాడు. వాడవాడలా తిరిగి కూరగాయలను విక్రయిస్తుంటాడు. తన వాహనం చోరీకి గురి కాకుండా, అదే విధంగా తన వాహనంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరోధించేందుకు వినూత్నంగా ఆలోచించాడు. తన వాహనానికి రూ. 3 వేలు ఖర్చు పెట్టి సీసీ కెమెరా ఏర్పాటు చేసుకున్నాడు. ఇది చర్చనీయాంశంగా మారింది. గౌస్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు. ఇదే విషయమై గౌస్‌ను 'సాక్షి' పలకరించగా, ''రాత్రి పూట పార్కు చేసి ఉన్న ఆటోలో కొందరు కూర్చొని మద్యం తాగుతున్నారని, అదే విధంగా వాహనం చోరీకి గురికాకుండా కెమెరా అమర్చుకున్నా'' అని చెప్పాడు. ప్రతి ఒక్కరూ ఇతరులపై ఆధారపడకుండా స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని అతను సూచించాడు.

దర్గా మెట్లకు మ్యాట్ అందజేత

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్‌లోని బాబా షర్ఫుద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి మెట్లకు మ్యాట్‌ను బహూకరించారు. ఎండలు మండి పోతుండడంతో మెట్లపై నడుచుకుంటూ పైకి ఎక్కే భక్తులకు అసౌకర్యం కలుగుతుందన్న విషయాన్ని స్థానిక 14వ వార్డు కౌన్సిలర్ హమీదా దస్తగిర్ దర్గా కమిటీ సభ్యులతో కలిసి ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సొంతంగా నిధులు రూ.2.60 లక్షలు వెచ్చించి మ్యాట్‌ను అందజేశారు. మంగళవారం మ్యాట్‌ను మెట్లపై పరిచిన నిర్వాహకులు ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ఫిన్ బధిరుల ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం



బధిర విద్యార్థులతో దేవీప్రసాద్, జానకి, బాలకృష్ణారెడ్డి తదితరులు

మలక్‌పేట: స్థానిక గవర్నమెంట్ క్వార్టర్స్‌లో ఉన్న ఫిన్ బధిరుల ఆశ్రమ పాఠశాల 17వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, వికలాంగుల సంఘాల నెట్‌వర్క్ సంస్థ అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాసులు, సోషల్ వర్కర్ వేణుగోపాల్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవీప్రసాద్ మాట్లాడుతూ, ఫిన్ ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు బధిర విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. నిస్సాయులకు చేయూతను అందించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. బధిర విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫిన్ ఆశ్రమ పాఠశాల అధ్యక్షురాలు జానకి, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, మేనేజ్‌మెంట్ కమిటీ రాజు, రాకేష్ జైన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్,వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 11, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 28, క్యారెట్ 23, దొండ 35, ఆలు 24, ఉల్లి 22, గోకర 40, దోస 19, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, ఆర్వి 45, మునగ 50, చిలగడదుంప 60, బీట్‌రూట్ 23, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యాప్సికమ్ 57. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

4న ఐవీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



ఉమెన్స్ డే కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మహిళా సంఘం నాయకులు

నాగోలు: అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ మహిళా విభాగం ఆధ్వర్యంలో వచ్చే మార్చి 4న నాగోలు పీబీఆర్ కన్వెన్షన్ ఉమెన్స్ డే ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం నాగోలులోని తన నివాసంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆవిష్కరించారు. మార్చి 4న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగే ఈ కార్యక్రమాల గుర్తించి వివరించారు. కార్యక్రమాన్ని మంత్రి సీతక్క, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

నియామక పత్రాల అందజేత ...

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) మహిళా విభాగంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులకు మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలిగా జాహ్నవి, హైదరాబాద్ అధ్యక్షురాలిగా చంద్రకళ, కార్యదర్శిగా జ్యోతి, వనస్థలిపురం అధ్యక్షురాలిగా సవిత, సెక్రటరీగా భవానీ, ఆర్కేపురం అధ్యక్షురాలిగా కె.అరుణ, కార్యదర్శిగా టి.గీతను నియమిస్తూ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్రశేఖర్, ఐవీఎఫ్ మహిళా విభాగం జనరల్ సెక్రటరీ మంజుల, ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, నరేష్ గుప్తా, కటకం శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ చింతల రజినీకాంత్, భువనగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీరన్నగుట్టపై శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు



వీరన్నగుట్టపై శివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి, డీసీ యాదయ్య

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధిలోని వీరన్న గుట్టపై ఉన్న భద్రకాళీ రామలింగేశ్వరస్వామి క్షేత్రం వద్ద శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. గుట్టపై శివరాత్రి ఏర్పాట్లను మంగళవారం ఆయన హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వీరన్నగుట్టపై శివరాత్రి వేడుకల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు కోసం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రత్యేకంగా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రాచీనమైన భద్రకాళీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి దేవాదాయశాఖ ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. వీరన్నగుట్ట ఆలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, రెవెన్యూ అధికారులు కబ్జాలను అడ్డుకొని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ స్ట్రీట్ లైట్స్ ఎలక్ట్రికల్ డిప్యూటీ ఇంజినీర్ పున్నా నాయక్, ఇంజినీరింగ్ డీఈ లావణ్య, చంద్రశేఖర్, జవాన్ శ్రీనివాస్, రమేష్, సమీప కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఉచితంగా ఆపరేషన్లు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

చైతన్యపురి: పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్న పిల్లలకు ప్రభుత్వ పథకం ద్వారా చైతన్యపురిలోని మాగ్నస్ ఈఎన్‌టీ ఆసుపత్రిలో అత్యాధునిక కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేస్తున్నామని డాక్టర్ రవికుమార్ తెలిపారు. అంతర్జాతీయ కాంక్లియర్ ఇంప్లాంట్ దినోత్సవం సందర్భంగా మంగళవారం మాగ్నస్ ఆసుపత్రిలో వినికిడి సమస్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్జన్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ, పుట్టుకతో వినికిడి లోపం ఉండే పిల్లలకు రూ. 10 లక్షల వ్యయం కాగల కాంక్లియర్ ఇంప్లాంట్ చికిత్స ఉచితంగా అందిస్తున్నామని, అలాగే ఆపరేషన్ అనంతరం ఉచితంగా స్పీచ్ థెరఫీ సేవలు అందిస్తామన్నారు. చిన్నపిల్లల్లో వినికిడి లోపం ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. సర్జరీ వివరాల కోసం నం. 9966000475 ద్వారా సంప్రదించవచ్చన్నారు. వైద్యులు సత్యకిరణ్, రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్ విద్యార్థులకు ఎల్వీప్రసాద్ ఐ హాస్పిటల్, విజన్ భారత్ యూకే వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ధనుంజయ్ మాట్లాడుతూ.. జనవరి 30వ తేదీన విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, ఈ రోజు అద్దాలను పంపిణీ చేశారని తెలిపారు. సామాజిక సేవా దృక్పథంతో విద్యార్థుకు కంటి అద్దాలను పంపిణీ చేసిన ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుడు జకీర్ తదితరులు పాల్గొన్నారు.

